
మహిళా దినోత్సవం


సాక్షి రాజన్న సిరిసిల్ల


బుధవారం । 8 । మార్చి । 2023














నా తండ్రి క'లా'

- ఆయన కోరిక మేరకే లా పట్టా చేతపట్టిన
- రాజన్నసిరిసిల్ల జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత



సాక్షి ఇంటర్వ్యూ

సిరిసిల్లటౌన్: 'కృషి ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు. నా తండ్రి కోరిక మేరకు లా పట్టా చేతబట్టి.. న్యాయవాద వృత్తిలో ప్రవేశించా' అని రాజన్నసిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. చదువు.. ఉద్యోగం.. రాజకీయాలు.. ఇలా అన్ని రంగాల్లో మహిళలు రాణించినప్పుడు మహనీయులు ఆకాంక్షించిన సమసమాజం ఆవిష్కృతమవుతుందని పేర్కొన్నారు. మహిళా దినోత్సవం రోజునే కాదని.. మహిళలు నిత్యం నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తన మనసులోని భావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

సాక్షి: న్యాయవాద వృత్తిలోకి ఎలా వచ్చారు?

జడ్జి: మాది మధ్య తరగతి కుటుంబం. సొంతూరు నిజామాబాద్. అమ్మ రాధ గృహిణి, నాన్న నారాయణ వ్యాపారి. అక్క, ఇద్దరు సోదరులు ఉన్నారు. 1993–96 వరకు మా ఊరిలోని జవహర్‌లాల్ నెహ్రూ లా కాలేజీలో చదివా. తర్వాత సంవత్సరం నుంచి లా ప్రాక్టీస్ మొదలుపెట్టాను.

సాక్షి: న్యాయవాది నుంచి న్యాయమూర్తిగా మీ ప్రస్థానం ?

జడ్జి: మా నాన్న ఆకాంక్ష మేరకు నేను లా చదివాను. నిజామాబాద్‌లో చాలా ఏళ్లు న్యాయవాదిగా పనిచేశాను. ఆరేళ్ల క్రితం ఖమ్మం జిల్లాలో, మూడేళ్ల క్రితం వరకు రంగారెడ్డి కోర్టుల్లో వివిధ హోదాల్లో న్యాయమూర్తిగా పనిచేశాను. రాజన్నసిరిసిల్లకు మొదటి జిల్లా జడ్జి, మహిళా జడ్జిగా నియమితులైనందుకు సంతోషంగా ఉంది.

సాక్షి: న్యాయవాది వృత్తినే ఎందుకు ఎంచుకున్నారు?

జడ్జి: చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే దానిని. నాలో ఉన్న ప్రతిభను నాన్న గారు గుర్తించి.. న్యాయవాది కావాలని కాంక్షించారు. అమ్మాయిని అయిన నాకు నాన్న గారు ఇచ్చిన ప్రోత్సాహం ఎక్కువ. లా కోర్సు పూర్తి చేశాక.. సొంతూరు నిజామాబాద్‌లో ప్రాక్టీస్ మొదలుపెట్టాను. విధి నిర్వహణలో అంకిత భావంతో ఉండాలనేది నా అభిలాష.

సాక్షి: నేటి మహిళలకు మీరిచ్చే సందేశం ?

జడ్జి: ఇప్పుడున్న పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారు. చదువు.. ఉద్యోగం.. వృత్తి.. ఇలా అన్నింటిలో మగవారితో పోటీగా రాణిస్తున్నారు. ఇల్లు, విధి నిర్వహణలో మేటిగా రాణిస్తున్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఆడపిల్లలు విద్యార్థి దశ నుంచే ఇష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధనకు అంకితభావంతో కృషిచేయాలి.

సాక్షి: మహిళా దినోత్సవంపై మీ అభిప్రాయం ?

జడ్జి: మహిళా దినోత్సవం ఏడాదిలో ఒక్క రోజు వచ్చే వేడుక మాత్రమే. కానీ ఆడవాళ్లు ఉన్నత స్థితికి చేరుకునేందుకు నిత్యం కృషి చేయాలి. దేశంలో అక్షరాస్యత, సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. మహిళల సంరక్షణ చట్టాలు పటిష్టంగా ఉన్నాయి. అయినా ఇప్పటికీ ఆడపిల్లలపై అకృత్యాలు, దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. ఇది సమాజానికి చేటు.

సాక్షి: వృత్తిపరమైన సంతృప్తి ఎలా ఉంది? ఆడపిల్లలకు మీరిచ్చే సలహాలు, సూచనలు ?

జడ్జి: జిల్లా జడ్జిగా సిరిసిల్లకు రావడం సంతృప్తి కలిగించింది. ఈ ప్రాంత ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆడపిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే దేన్నయినా సాధించగలరు. సమాజంలో ఆడపిల్లలపై మానవీయ కోణంలో ఆలోచనలు పెరగాలి. సిరిసిల్లలోనూ మహిళా న్యాయవాదుల సంఖ్య పెరగడం హర్షణీయం.

ఆడపిల్లగా భువిపైకి వచ్చి..
అక్కగా ఆదరించి..
చెల్లిగా తోడుగా నిలిచి..
భార్యగా ఏడడుగులు నడిచి..
అమ్మగా లాలించి..
ఇల్లాలిగా ఇంటిని పాలించి..
భావి తరాలకు మార్గదర్శిగా నిలిచింది మహిళ.

ఆమె అవని.. విశ్వానికి జనని.. ఆమె ఓపికకు వందనం. ఆమె లేనిదే జననం లేదు. ఈ ప్రపంచానికి మనుగడే లేదు. నాడు వంటింటికే పరిమితమై ఇల్లుదాటని మహిళ నేడు ఆకాశంలో సగం.. అవనిలో సగం అన్నట్లు సాగుతోంది. చదువులో అగ్రస్థానంలో నిలుస్తూ.. అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. అటెండర్ నుంచి ఐఏఎస్, ఐపీఎస్ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఇంటి బాధ్యతలను మరో చేతితో మోస్తోంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు మహిళలు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ఆడపిల్ల పుట్టిందంటే భయపడే నాటి కాలం నుంచి మహాలక్ష్మిగా భావిస్తూ.. ఘనస్వాగతం పలుకుతున్నారు కొందరు. ఊర్లో అమ్మాయి పుడితే ఆర్థికంగా అండగా ఉంటున్నారు పలువురు ప్రజాప్రతినిధులు.. ఓటమిని పట్టించుకోమంటూ... గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు నేటి యువత. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..!!

అన్నింటా ఆమె..

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం





ప్రభుత్వ ఉద్యోగులు.. ఈ తల్లీకూతుళ్లు

సిరిసిల్లకల్చరల్: కుటుంబ బంధాలతో చదువు మానేసిన పుష్కర కాలానికి తిరిగి ప్రారంభించిన తల్లి.. కన్నవాళ్ల ఆశలకు అనుగుణంగా కష్టపడే కూతురు.. ఇద్దరూ పోటీ పడి ఉద్యోగాలు తెచ్చుకుని అతివలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సింగరేణి ప్రాంతానికి చెందిన రౌతు అలేఖ్యపటేల్ జిల్లా శిశు అభివృద్ధి అధికారిణిగా, తన తల్లి రౌతు పద్మ ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో లెక్చరర్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. 2018లో.. ఇద్దరూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే పోస్టింగ్ కావడం మరో విశేషం. మంథని సమీపంలోని రామకృష్ణాపూర్‌కు చెందిన రౌతు పద్మకు పదోతరగతి పూర్తయ్యాక పెళ్లి అయింది. పెద్ద కుటుంబానికి చిన్నకోడలుగా వెళ్లిన ఆమె వివాహం అనంతరం 12 ఏళ్లపాటు చదువుకు దూరమయ్యారు. తన కూతురు అలేఖ్య ఆరో తరగతి వచ్చే సమయానికి కొంత తీరిక దొరికింది. భర్త ప్రోత్సహించడంతో ఓపెన్ వర్సిటీ ద్వారా డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ కోర్సులు పూర్తి చేశారు. నెట్ పరీక్షలోనూ ఉత్తీర్ణురాలై తొలి ప్రయత్నంలోనే టీజీటీ, పీజీటీ ఉద్యోగాలు సాధించారు. పీజీటీగా తొలి పోస్టింగ్ బోనాల గురుకుల పాఠశాలలో విధుల్లో చేరారు.

అలేఖ్య.. స్టేట్ ఫస్ట్ ర్యాంక్

పద్మ కూతురు అలేఖ్య సైతం తల్లితో పోటీ పడి టీఎస్‌పీఎస్‌సీలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. కేవలం 21 ఏళ్ల 10 నెలల ప్రాయంలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో సీడీపీవోగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తోంది. తను ఇంటర్మీడియెట్‌లో ఉన్నప్పుడు కరీంనగర్ కలెక్టర్‌గా వ్యవహరించిన స్మితా సబర్వాల్‌ను స్ఫూర్తిగా తీసుకున్న అలేఖ్యపటేల్ ప్రస్తుతం సివిల్స్‌కు ప్రిపేర్ అవుతోంది.



తల్లీకూతుళ్లు అలేఖ్య, పద్మ

పిన్న వయసులోనే జడ్జిగా..

- నర్సారావుపేట జూనియర్ సివిల్ జడ్జిగా వేములవాడ ఆడబిడ్డ

వేములవాడ: వేములవాడ ప్రాంతానికి చెందిన తడిగొప్పుల ప్రవళిక అతిచిన్న వయసులోనే జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 21 ఏళ్ల వయసులోనే మొదటి ప్రయత్నంలోనే ఆంధ్రప్రదేశ్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందిన తడిగొప్పుల మురళీ-విజయ దంపతుల కూతురు తడిగొప్పుల ప్రవళిక. కాకతీయ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. పీజీ లాసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా కాలేజీలో ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు. మొదటి ప్రయత్నంలోనే ఆంధ్రప్రదేశ్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా నరసరావుపేట జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. బాలికల విద్య, ఆర్థిక స్వాతంత్ర్యంతోనే సమాజంలో లింగ వివక్ష పోతుంది.. మహిళలు విద్యతోనే అభివృద్ధి సాధిస్తారని ప్రవళిక అభిప్రాయపడ్డారు.



'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా 'ప్రియాంక'

- ఉమెన్స్ డే కథనాలను పర్యవేక్షించి ఫైనల్ చేసిన జెడ్పీ సీఈవో
- కథనాల ఎంపిక, డిజైన్‌లలో పలు సూచనలు
- యూనిట్ కార్యాలయంలో పలు విభాగాల సందర్శన
- పత్రిక రావడం వెనుక ఇంత శ్రమ ఉంది : ప్రియాంక



మహిళా దినోత్సవం కథనాలు పరిశీలిస్తున్న ప్రియాంక

కరీంనగర్: కరీంనగర్ జిల్లా పరిషత్ సీఈవో ప్రియాంక మంగళవారం సాయంత్రం తిమ్మాపూర్‌లోని 'సాక్షి' యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గెస్ట్ ఎడిటర్‌గా ఆహ్వానించగా.. సీఈవో హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్తా విశేషాలు, న్యూస్ ఎడిటింగ్ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మహిళా దినోత్సవం ప్రత్యేక కథనాలను పరిశీలించారు. వార్తా కథనాల్లోని వ్యక్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఉద్యోగుల వివరాలు, పత్రిక ప్రింటింగ్ సమయాలు, ఏయే విభాగాల్లో ఎంత మంది ఉద్యోగులు ఉంటారనే విషయాలపై ఆరా తీశారు. పత్రిక మెయిన్ పేజీతోపాటు జిల్లాల పేజీలను ప్రింటింగ్ అయ్యే సమయంలో ప్లేట్స్‌ను ఎలా వినియోగిస్తారనే విషయాన్ని ఆసక్తిగా పరిశీలించారు. జిల్లా పేజీల కూర్పు, తదితర వివరాలపై 'సాక్షి' సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. 'ఎంతో మంది నిరంతరం శ్రమిస్తే గాని పేపర్ బయటకురాదు. ప్రతీ క్షణం సమాచారం అందించాలనే తపనతో పనిచేస్తుండడం అభినందనీయం. మహిళా దినోత్సవం ప్రత్యేక కథనాలు బాగున్నాయి. ఇతరులను ప్రభావితం చేసే అంశాలను ఎంచుకున్నారు..' అని అన్నారు. వార్తల సేకరణ.. ఎడిటింగ్.. పేజీ డిజైనింగ్.. గురించి అడిగి తెలుసుకున్నారు. పేజీ డిజైనింగ్‌ను పరిశీలించి.. హెడ్డింగ్ బాగుందని కితాబునిచ్చారు. మహిళ దినోత్సవం సందర్భంగా పత్రిక కార్యాలయాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకోవడం సంతృప్తినిచ్చిందని చెప్పారు.

మరిన్ని అవకాశాలు కల్పించాలి



కుటుంబంలోనే విభిన్న పాత్రలు పోషిస్తున్న మహిళలు.. పాలనలోనూ దూసుకెళ్తున్నారు. సమాజంలోని వివిధ సమస్యలను అర్థం చేసుకొని, పరిష్కరించడంలో ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. మరిన్ని అవకాశాలు కల్పిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరు. – జిందం కళ, మున్సిపల్ చైర్‌పర్సన్

ఉన్నత విద్యతోనే మహిళాభివృద్ధి



ఉన్నత విద్యతోనే మహిళాభివృద్ధి సాధ్యం. మహిళల్లో ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళల కోసం కల్పించిన 50 శాతం రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి.

– రామతీర్థపు మాధవి, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్

మహిళా అభ్యుదయంతోనే నవసమాజం



సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. శక్తి, సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. రిజర్వేషన్ కారణంగా పాలనలోనూ మహిళలు తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. మహిళలు మరింత ప్రగతి సాధించినప్పుడే నవసమాజం నిర్మితమవుతుంది.

– న్యాలకొండ అరుణ, జెడ్పీ చైర్‌పర్సన్

మరో జన్మలోనూ మహిళగానే..

- ప్రోత్సహిస్తే దూసుకెళ్తాం..
- ఆడపిల్లలపై వివక్ష వీడితేనే సమాజాభివృద్ధి
- 'సాక్షి' సర్వేలో పలువురు వెల్లడి

సిరిసిల్లకల్చరల్: నింగి..నేల.. ఏ రంగంలో చూసిన మహిళలు రాణిస్తున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితం అన్న నిర్బంధాలను ధ్వంసం చేసిన ఆధునిక మహిళ అన్నింటా తానై దూసుకెళ్తోంది. ఆడపిల్లగా పుట్టినందుకు గర్వపడుతున్న వారి సంఖ్యే నేడు పెరిగింది. మరో జన్మంటూ ఉంటే తిరిగి ఆడపిల్లగానే పుట్టేందుకు ఇష్టపడుతున్న వారు అనేకం. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వివిధ వర్గాలకు చెందిన సుమారు వంద మంది మహిళల అభిప్రాయాలను 'సాక్షి' సేకరించింది. ఈ సందర్భంగా వారు ఇలా స్పందించారు.

ప్రోత్సహించండి..



సమాజంలో స్త్రీ, పురుష వివక్ష కొనసాగినంత కాలం మహిళల శక్తి సామర్థ్యాలు వెలుగులోకి రావు. విశాలంగా ఆలోచిస్తే ఆడపిల్లలు ఏ రంగంలోనైన దూసుకువెళ్తారు. సరైన దిశగా ప్రోత్సహిస్తే ప్రతీ మహిళ విజేతనే.

– రాపెల్లి సుప్రియ, గ్రాడ్యుయేట్

ఉన్నత విద్యతోనే ప్రగతి



ఇద్దరు పిల్లలు ఉన్న ఇంట్లో ఒక్కరినే చదివించాల్సిన పరిస్థితులు ఏర్పడితే ఆడపిల్ల చదువు ఆపేయిస్తున్నారు. ఆడపిల్లల చదువు, లాభం లేని ప్రక్రియగా భావిస్తున్నారు. ఉన్నత విద్యతోనే నేటితరం మహిళలకు ప్రగతి సాధ్యమవుతుంది.

– కామారపు పద్మశ్రీ, గ్రాడ్యుయేట్

సామాజిక దృక్పథం మారాలి



ఆడపిల్లల విషయంలో సామాజిక దృక్పథంలో మార్పు రావాలి. ప్రతి రంగంలోనూ తమ ముద్ర వేస్తున్న మహిళల శక్తి యుక్తులను కూడా సమాజం అభివృద్ధి చెందేందుకు వినియోగించాలి. మహిళల ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించాలి.

– సామల అశ్విత, గ్రాడ్యుయేట్

మోహినికుంట ప్రగతి.. మహిళలదేనంటూ..

ముస్తాబాద్(సిరిసిల్ల): అవకాశాలు ఇస్తే తాము ఏం చేయగలమో నిరూపించారు ముస్తాబాద్ మండలంలోని మోహినికుంట గ్రామ మహిళలు. గ్రామపంచాయతీ పాలకవర్గంలో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్ వరకు అందరూ మహిళలే. పంచాయతీ కార్యదర్శి సైతం మహిళే కావడం మరో విశేషం. అభివృద్ధిలో దూసుకెళ్తున్న మోహినికుంట గ్రామం.. పాలనలోనూ ఆదర్శంగా నిలుస్తోంది. ఉమ్మడిగా నిర్ణయాలు తీసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. మండలంలోని ఇతర గ్రామాలతో పోటీపడుతూ దూసుకెళ్తున్న మోహినికుంట గ్రామం మహిళా శక్తికి నిదర్శనంగా నిలుస్తోంది.



పాలకవర్గంలో అందరూ మహిళలే..

2019లో మోహినికుంట సర్పంచ్ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించారు. గ్రామస్తులు ఐక్యంగా ఎనిమిది వార్డుస్థానాలలో మహిళలనే ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా కల్వకుంట్ల వనజ, ఉపసర్పంచ్‌గా నారాయణోజు సంధ్య, వార్డు సభ్యులుగా కుందెన రాజేశ్వరి, పల్లాటి భూదేవి, నారాయణోజు వనజ, రాజం లక్ష్మి, జంపెల్లి ఈశ్వరి, మేరుగు పుష్ప, శీలం సంతోష ఎన్నికయ్యారు. వీరికితోడుగా పంచాయతీ కార్యదర్శిగా రాపెల్లి గీత, ఏఈవోగా రేవతి, ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం జయసుధ తదితర శాఖల అధికారులు కూడా మహిళలే వచ్చి పనిచేస్తున్నారు.

- రెండుసార్లు ఉత్తమ పంచాయతీగా ఎన్నికైంది.
- కేంద్ర ప్రభుత్వ చైల్డ్‌ఫ్రెండ్లీ విలేజ్ అవార్డుకు ఎంపికైంది.
- ఓపెన్ జిమ్, మహిళా భవనం, గోదాం, డ్రెయినేజీలు, 56 మంది నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు, కమ్యూనిటీ భవనాలు నిర్మించారు. గ్రామంలో ఒక్క మట్టిరోడ్డు లేదు.
- మంత్రి కేటీఆర్ రూ.2 కోట్లతో ఏసీ ఫంక్షన్‌హాల్ నిర్మించారు.
- పాలకవర్గ సభ్యులు ప్రతీ వారం వార్డు విజిట్ చేస్తూ.. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.
- స్పోకెన్ ఇంగ్లిష్, యోగా తరగతులు నిర్వహించారు.
- ఇంటింటికీ ఇంకుడుగుంత, మరుగుదొడ్లు నిర్మించారు.
- స్వశక్తి మహిళల ఉపాధి కోసం దుకాణాలు ప్రారంభించారు.

మహిళా సాధికారత దిశగా..



మహిళాశక్తిని చాటేలా పనులు చేస్తున్నాం. అందరం మహిళలే ఉండడం గర్వకారణం. మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధికి నిధులు ఇచ్చారు. గ్రామంలో చేపట్టిన పనులకు అవార్డులు వచ్చాయి. మహిళా సాధికారత దిశగా పనిచేస్తున్నాం. నాలుగేళ్లలో అనేక విజయాలు సాధించాం. – కల్వకుంట్ల వనజ, సర్పంచ్

క్లుప్తంగా

ఒంటరితనం భరించలేక వ్యక్తి ఆత్మహత్య


ధర్మాగౌడ్ మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన సాయబుగారి ధర్మాగౌడ్ (55) ఒంటరితనం భరించలేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గీతాకార్మికుడైన ధర్మాగౌడ్ భార్య ఇటీవల చెరువులో పడి చనిపోయింది. కూతురు ప్రేమ వివాహం చేసుకుంది. ధర్మాగౌడ్ ఒంటరిగా మిగిలి స్థానిక అనాథాశ్రమంలో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం టీ తాగి వస్తానని చెప్పి ఆశ్రమం నుంచి బయటకు వచ్చాడు. మంగళవారం ఉదయం స్థానిక నమాజ్ చెరువులో శవమయ్యాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్టు

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలోని చీర్లవంచ గ్రామంలో పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఎనుకొండ వేణు, మోటం ప్రశాంత్‌లు మద్యం మత్తులో వారి విధులకు ఆటంకం కలిగించారు. అంతటితో ఆగకుండా దుర్భాషలాడుతూ రాళ్లతో దాడి చేసేందుకు ప్రయత్నించారు. దీంతో ఆ ఇద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి


చంద్రారెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బక్కయ్యగారి చంద్రారెడ్డి(65) గుండెపోటుతో మృతిచెందాడు. చంద్రారెడ్డి రోజు మాదిరిగానే సోమవారం వ్యవసాయ పనులు ముగించుకోని ఇంటికొచ్చి, రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం తెల్లవారు జామున నిద్రలేవలేదు. కుటుంబ సభ్యులు ఉదయం లేపేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. హోలీ పండుగా రోజే కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పేద రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతునికి భార్య పుష్పలత, కుమారులు బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి ఉన్నారు.

అంబరాన్నంటిన రంగుల సంబరం


సిరిసిల్లలో రంగులు చల్లుకున్న ప్రజలు


హోలీ వేడుకల్లో చిన్నారుల ఆనందం

- జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలు
- డీజే సౌండ్స్‌తో ఆటపాడిన జిల్లావాసులు

సిరిసిల్ల టౌన్: హోలీ వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లో మహిళలు, యువత రంగులు చల్లుకొని, శుభాకాంక్షలు చెప్పుకున్నారు. యువకులు బైక్‌లపై తిరుగుతూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, సిబ్బంది కలిసి చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్యలకు రంగులు చల్లారు. ఎస్పీ అఖిల్ మహాజన్ తన క్యాంపు ఆఫీసులో సిబ్బందితో కలిసి హోలీ ఆడారు. ఆటపాటలతో అలరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పరకాల ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అధికారులు, వివిధ పార్టీల నాయకులు ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు.


డ్రమ్ వాయిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్


వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కళ, ప్రజాప్రతినిధులు, నాయకులు

కాంగ్రెస్ బహిరంగ సభకు తరలిరండి


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్: ఈ నెల 9న కరీంనగర్‌లో జరిగే హాథ్ సే హాథ్ జోడో బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలంలోని అనుపురం గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు ముఖ్య అతిథిగా చత్తీస్‌ఘడ్ సీఎం భూపేశ్ బగేల్ వస్తున్నారని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500లకే సిలిండర్ ఇస్తామన్నారు. రైతులు పండించిన వరిధాన్యం క్వింటాల్‌కు రూ.2,500లకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. అన్నదాతలకు ఇందిరమ్మ భరోసా కింద ఏటా రూ.15 వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలిస్తామని పేర్కొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, సర్పంచ్ కదిరే రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్, నాయకులు ఆగయ్య, ప్రభాకర్‌రెడ్డి, రాజు, పర్శరాములు తదితరులున్నారు.

వైభవోపేతం.. స్వామివార్ల డోలోత్సవం


వేములవాడలో డోలోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో త్రిరాత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడోరోజు ఆలయ అద్దాల మండపంలో డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో స్వామి డోలోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని డోలోత్సవాన్ని వీక్షించారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట వేణుగోపాలస్వామి, నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయాల్లో మంగళవారం డోలోత్సవం నిర్వహించారు. పండితులు వేణుగోపాలాచారి ఆధ్వర్యంలో భక్తులు గోగుపువ్వు రంగును స్వామివారిపై చల్లుతూ వసంతోత్సవం జరిపారు. సర్పంచ్ నిమ్మ లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్‌లు సూర నర్సయ్య, నంది కిషన్, ఉపసర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ ఆపేరా సుల్తానా, మాజీ సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య పాల్గొన్నారు.


టగ్ ఆఫ్ వార్ పోటీలో మహిళలు

ఘనంగా మహిళా దినోత్సవం

సిరిసిల్ల: సిరిసిల్లలోని పద్మశాలీ కల్యాణ మండపంలో లక్ష్మీ మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. సమాజంలో మహిళల పాత్రపై ప్రసంగించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. పద్మశాలీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జె రాజేశ్వరిని సన్మానించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు గుజ్జె తార, ప్రధాన కార్యదర్శి కె.వింధ్యారాణి, కౌన్సిలర్ పత్తిపాక పద్మ, మాస్టర్ అథ్లెట్ టి.రామానుజమ్మ, పద్మశాలి సంఘం మహిళా నాయకురాలు బూట్ల లత పాల్గొన్నారు.

ఆదర్శంగా పథకాల అమలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కుగ్రామంలోనూ ప్రభుత్వ పథకాల అమలు తీరు ఆదర్శంగా ఉందని సివిల్స్ శిక్షణ అధికారులు కొనియాడారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో మంగళవారం అధికారులు గ్రామస్తులతో కలిసి హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. శిక్షణ అధికారులు అర్జున్‌గుప్తా, అనుచల్‌జైన్, పంకజ్‌మీనా, హర్షిత్ అగర్వాల్, అంకితమోండల్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో ముందున్న రాజన్నపేటను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. పోర్టబుల్ ఏటీఎంలు ఇక్కడ వాడుకోవడం గొప్ప విషయమన్నారు. సాయంత్రం ఎగువమానేరు ప్రాజెక్ట్‌ను సందర్శించారు. సర్పంచ్ ముక్క శంకర్, కార్యదర్శి రవి, ఎంపీవో వజీరు ఉన్నారు.

ఏడుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): హోలీ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఏడుగురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై శేఖర్ మాట్లాడుతూ.. పండుగ నేపథ్యంలో ఆంక్షలు అమలులో ఉన్నప్పటికీ మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై కేసులు నమోదు చేశామన్నారు. ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే కేసులు పెడతామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరుకు చెందిన ఆదిపెల్లి దేవయ్య అనే గీత కార్మికుడు మంగళవారం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారి, కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. తోటి గీత కార్మికులు సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి విడుగురాళ్ల బాలరాజ్‌గౌడ్, తాళ్లపల్లి తిరుపతి, బెజ్జారం నారాయణ, నల్లూరి నర్సయ్యలు దేవయ్యను పరామర్శించారు.

'సృజన'ను వరించిన పురస్కారం

- ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైన కందేపి రాణీప్రసాద్
- బాలసాహిత్యంలో సేవలకు అధికారిక గుర్తింపు
- నేడు హైదరాబాద్‌లో అవార్డు ప్రదానం


కందేపి రాణీప్రసాద్

సిరిసిల్లకల్చరల్: సృజనాత్మక హస్త కళాకారిణి, బాల సాహితీవేత్త, కాలమిస్టుగా గుర్తింపు పొందిన డాక్టర్ కందేపి రాణీప్రసాద్‌కు అరుదైన గౌరవం లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విభిన్న రంగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించి 27 మంది మహిళలను ప్రత్యేక పురస్కారాలకు ఎంపిక చేసింది. ఇందులో భాగంగా సాహిత్య విభాగంలో రాణీప్రసాద్‌ను ఎంపిక చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి భారతీ హోళీకేరి ఉత్తర్వులు జారీ చేశారు. అవార్డు కింద రూ.లక్ష నగదును ప్రభుత్వం అందజేయనుంది.

రాణీప్రసాద్ సేవలివీ...

బాలసాహితీవేత్తగా సుమారు 50కి పైగా పుస్తకాలు వెలువరించారు. పాతికేళ్లుగా సాహితీ సేద్యం చేస్తూ అనేక ప్రక్రియల్లో కవితాశక్తిని చాటుకున్నారు. కథలు, కవితలు, కల్పికలు, వ్యాసాలు, పజిల్స్, సైన్స్ వ్యాసాంగం వంటి ప్రక్రియల్లో రాణించారు. 1999లో 'పూలతోట'తో ప్రారంభమైన రచనా వ్యాసాంగం సరదా సరదా బొమ్మలు, హరివిల్లు, నెలవంక, సైన్స్‌పాయింట్, బాల తేజం, నంది వర్ధనాలు, బాల్యమా ఎక్కడ నీ చిరునామా, విహారం, కస్తూరిబా జీవిత చరిత్ర, మిఠాయి పొట్లం, సైన్స్ వరల్డ్, సీతాకోక చిలుక, హౌస్ వైఫ్, సైన్స్‌కార్నర్, పూలజడ, స్వీటి మిల్కీ ఓ చిలుక, ద్రాక్షగుత్తులు, కనుచూపు మేర, సౌరభం, పజిల్స్ పాయింట్, బొటానికల్ జూ, సృజన, క్వారంటైన్, డాక్టర్ చెప్పిన కథలు, నా జ్ఞాపకాల్లో అమ్మ తదితర పుస్తకాలను వెలువరించారు. మరో 9 పుస్తకాలను అనువదించారు. వ్యర్థమైన పదార్థాలతో అర్థవంతమైన ఆకృతులను తీర్చిదిద్దడంలోనూ రాణీప్రసాద్ సృజనాత్మకతను ప్రదర్శించారు. సిరిసిల్లలోని ప్రఖ్యాత పిల్లల వైద్యులు ప్రసాద్‌రావు సతీమణి, ఆసుపత్రి వ్యవహారాలు పర్యవేక్షిస్తూనే తన మనోభీష్టమైన సృజనాత్మకత, సాహితీ సేవ చేస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పురస్కారానికి ఎంపికవడంపై జిల్లా సాహితీవేత్తలు, వైద్యులు అభినందనలు తెలిపారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, ఆడెపు లక్ష్మణ్, అంకారపు రవి, బూర దేవానందం అభినందించారు.

వేములవాడకు ఎంపీ సంజయ్ ఏం చేశాడు ?

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


మాట్లాడుతున్న వేణు

వేములవాడఅర్బన్: మతం పేరుతో వచ్చే పార్టీలను తరిమికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. వేములవాడలో మంగళవారం జరిగిన సీపీఐ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ వేములవాడ పట్టణానికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని కోరారు. మతం పేరుతో వచ్చే పార్టీలను తిప్పి కొట్టాలన్నారు. దేశసంపదను అదాని, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టును చిత్తశుద్ధితో పూర్తిచేసి రైతులకు సాగునీటిని అందజేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ సీపీఐ పట్టణ కార్యదర్శిగా ఎల్ల దేవరాజు, సహాయ కార్యదర్శులుగా పండుగ పోచమల్లు, దుర్గయ్య, పోశెట్టి, అనసూర్య, పెంట శ్రీనివాస్, మణితేజలను నియమించినట్లు ప్రకటించారు. నాయకులు కదారి రాములు తదితరులు ఉన్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం బండపల్లి శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం కనులపండువగా సాగింది. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఆలయంలో రథ హోమం, పూర్ణాహుతి, రథ బలిహరణ పూజలు చేశారు. ఉత్సవమూర్తులను రథంపై ఉదయం 11 గంటలకు ఊరేగింపునకు సిద్ధం చేశారు. సర్పంచ్ న్యాత విజయజార్జ్, నాయకులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కటకం రవి, మల్యాల గంగనర్సయ్య, పురంశెట్టి శేఖర్, కటకం చంద్రయ్య, మ్యాకల మహిపాల్, గడ్డం వరుణ్‌రెడ్డి, లింగంపల్లి బాబు, అటుకుల మధుసూదన్‌రెడ్డి, గడ్డంపల్లి రంజిత్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శివకల్యాణ మహోత్సవాలు


వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ అర్బన్: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయంలో ఈ నెల 9 నుంచి 13 వరకు శివకల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఆలయ అధికారులు, అర్చకులతో వేడుకల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. శివకల్యాణానికి 25 వేల మందికి పైగా శివపార్వతులు, 20 వేల మందికి పైగా సాధారణ భక్తులు రానున్నట్లు అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయ గోపురాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నామని చెప్పారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఐదు రోజుల పాటు ఉత్సవాలను జరుపుతారని అన్నారు. ఈ నెల 10న ఆది దంపతుల కల్యాణ మహోత్సవం అభిజిత్ లగ్న సముహూర్తమున ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న స్వామివారి రథోత్సవం, శృంగార వసంతోత్సవం, 13న త్రిశూలయాత్ర, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.